

క్రిస్మస్ జోష్

● జిల్లా వ్యాప్తంగా వేడుకలు ● చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు ● అంతటా సందడే సందడి



గరుగుబిల్లి మండలం రావుపల్లి చర్చిలో ...



పాలకొండ ఆర్‌సీఎం చర్చిలో..



పార్వతీపురం సెయింట్ జోన్స్ చర్చిలో..



లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పార్వతీపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా పాస్టర్లు క్రీస్తు జననం, సందేశాలను వివరించారు. బైబిల్ చదివి వినిపించారు. ఆరాధనలతో ఆశీస్సులు అందజేశారు. మరోవైపు వాడవాడలా క్రైస్తవులు కేకులను కట్ చేసి ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఇళ్ల వద్ద స్వీట్లు పంచిపెట్టి.. విందు భోజనాలు ఏర్పాటు చేశారు. వర్షం కురిసినప్పటికీ అంతటా సందడి వాతావరణం కనిపించింది. చిన్నారులు, యువత కేరింతలు కొట్టారు. శాంతాక్లాజ్ వేషధారులు అందరినీ ఆకట్టుకున్నారు. మొత్తంగా జిల్లాలో క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి.

- పూర్తి వివరాలు 7వ పేజీలో



సాలూరు పట్టణంలోని పెనియేలు మందిరంలో కొవ్వొత్తులతో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

నేడు పాఠశాలలకు సెలవు

సాలూరు రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో రానున్న 24 గంటల్లో జిల్లాలో భారీగా వర్షాలు కురవనున్నాయనే వాతావరణ శాఖ సమాచారంతో గురువారం జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఎంఈవోల అధికారిక గ్రూప్‌లో సమాచారం పోస్ట్ చేశారు. వర్షాల నేపథ్యంలో జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు ఈ సెలవు వర్తిస్తుంది.



నిరసన తెలుపుతున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

స్పందించండయ్యా..

● గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల వినూత్న నిరసన

సీతంపేట రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలపై స్పందించి పరిష్కార మార్గం చూపాలని గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. కొద్దిరోజులుగా దీక్షలు చేపడుతున్న వారు బుధవారం ఐటీడీఏ అడవితల్లి విగ్రహం ఎదుట ఒంటికాలిపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్‌లు నెరవేర్చే వరకు వెనక్కి తగ్గేదే లేదన్నారు. సీఆర్‌టీలతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు గణేష్, మాధవి, భాగ్యలక్ష్మి, మోహనరావు, రవి నినాదాలు చేశారు.

చెరువు కాదండోయ్..



భామిని, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు అలికాం-బత్తిలి దారిలో సింగిడి రోడ్డుపై గుంతల్లో ఇలా నీరు చేరింది. దీంతో ఆ మార్గం చెరువును తలపిస్తోంది. ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. ఇటీవల ఈ దారిలో చిన్న చిన్న గుంతలను పూడ్చి తూతూ మంత్రంగా పనులు చేపట్టారు. అయితే కొద్ది రోజులుగా కురుస్తున్న జోరు వర్షాలకు మళ్లీ యథాస్థితి నెలకొంది. దీంతో కొరమ, ఘనసర, పసుకుడి, బిల్లుమడ రహదారిలో ప్రయాణమంటేనే వాహనదారులు భయపడుతున్నారు. గుంత ఎక్కడుందో.. రోడ్డు ఎక్కుడుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

567 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 567 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు పార్వతీపురం డివిజన్‌లో 244, పాలకొండ డివిజన్‌లో 323 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. మిగిలిన రెవెన్యూ గ్రామాల్లో సైతం పక్కాగా సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామసభలలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి రశీదును అందించాలని తెలిపారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించి ధ్రువప్రతాలు జారీ చేయాలన్నారు. ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించాలని సూచిం చారు. ఆన్‌లైన్‌లో అన్ని ఫిర్యాదులను నమోదు చేయాలని, తహసీల్దార్ నేతృత్వంలోని బృందం విచారణకు వెళ్లే సమయాన్ని ముందుగా ఆ గ్రామస్థులకు తెలియజేయాలని ఆదేశించారు. కోర్టు కేసులను గుర్తించడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. సరిహద్దు వివాదాలు ఉంటే మండల సర్వేయర్‌తో భూ సర్వే చేయించాలని తెలిపారు.

అత్యవసరమైతే.. అంతే!

● 'మన్యం'లో రక్త నిల్వల కొరత
● బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నా.. ముందుకు రాని దాతలు
● అరుదైన బ్లడ్ గ్రూపులకూ తప్పని ఇబ్బందులు
● ఇంకా ప్రారంభం కాని మూడు రక్త నిల్వ కేంద్రాలు
● పొరుగు జిల్లాలకు రోగుల పరుగు



జియ్యమ్మవలస, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రక్త నిల్వల కొరత తీవ్రంగా ఉంది. ఏటా దాదాపు 9 వేల యూనిట్లు అవసరమై ఉండగా 3 వేల యూనిట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో అత్యవసర వేళల్లో రోగులు పొరుగు జిల్లాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. రక్తహీనత కేసులు, తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా, గర్భిణులు, బాలింతలు, వివిధ ప్రమాదాల్లో క్షతగాత్రులకు ఏటా రక్త అవసరాలు పెరుగుతూనే ఉన్నాయి. అయితే ఆ స్థాయిలో నిల్వలు లేకపోవడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో నెలకు ఆయా కేసులకు 200 నుంచి 300 యూనిట్ల వరకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా అందిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో బ్లడ్ నిల్వలు లేకపోవడం వల్ల ఒక్కోసారి రోగుల బంధువులు, కుటుంబ సభ్యుల నుంచి సేకరించి రక్తం అందిస్తున్నారు. మరోవైపు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నా.. ఆశించిన స్థాయిలో రక్తదాతలు ముందుకు రావడం లేదు. కొన్ని బ్లడ్ గ్రూపుల రక్తం కూడా లభించకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాల్సి ఉంది. రక్తదానంపై ప్రజలను చైతన్యవంతం చేయాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా విభజన కాక ముందు 2007లో పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తనిధి కేంద్రం ప్రారంభమైంది. కొన్నాళ్ల తరువాత ప్రభుత్వ రక్తనిధి కేంద్రంగా మారింది. జిల్లా ఆవిర్భావం తర్వాత సాలూరు, పాలకొండ, సీతంపేట ప్రాంతీయ ఆసుపత్రులుగా మారాయి. రక్తదాన శిబిరాల్లో దాతల నుంచి సేకరించిన రక్తంలో కొంత జిల్లా కేంద్ర ఆసుపత్రిలో భద్రపరిచి, మిగిలిన కొంత ప్రాంతీయ ఆసుపత్రుల్లో బ్లడ్ స్టోరేజీ యూనిట్లకు పంపిస్తున్నారు. కానీ రక్తదాతలు పెద్దగా ముందుకు రాకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాకు వచ్చిన కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ముందు చూపుతో పీహెచ్‌సీ స్థాయిల్లో కూడా బ్లడ్ డొనేషన్ క్యాంపులు ఏర్పాటు చేశారు. అయితే జిల్లా అవసరాలకు తగ్గట్టుగా రక్త నిల్వలు లేకపోవడం కలవరపరుస్తోంది. ప్రధానంగా ఏ, బీ, ఓ నెగిటివ్ బ్లడ్ గ్రూపులు, ఏబీ నెగిటివ్, ఏబీ పాజిటివ్ గ్రూపుల రక్తం అంతగా లభ్యం కావడం లేదు. ఇలాంటి వారిని విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు. వేసవిలో అయితే రిఫరల్ కేసుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అత్యవసరమైతే స్వచ్ఛంద సంస్థలు, ఇతరుల నుంచి దాతలకు సమాచారం ఇచ్చి రక్తం సేకరిస్తున్నారు. అయితే ఇందుకు కొంత సమయం వరకు నిరీక్షించాల్సి వస్తోంది.



కురుపాంలో బ్లడ్ స్టోరేజ్ యూనిట్

అవసరం ఇలా...

పార్వతీపురంలో జిల్లా కేంద్రాసుపత్రి, ప్రాంతీయ (ఏరియా) ఆసుపత్రులు మూడు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు మూడుతో పాటు 37 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఏటా దాదాపు 300 వరకు ప్రమాదాలు జరుగుతున్నాయి. సుమారు 500 మంది నుంచి 700 మంది వరకు క్షతగాత్రులు ఆసుపత్రులకు చేరుతుండగా.. వీరిలో 200 మంది వరకు రక్తం అవసరం అవుతోంది.

● ప్రాంతీయ ఆసుపత్రులు సాలూరు, సీతంపేట, పాలకొండలో రోజుకు నాలుగైదు యూనిట్లు, చినమేరంగి, భద్రగిరి, కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రెండు యూనిట్లు వరకు అవసరం.

● అంతేకాకుండా సికిల్ సెల్ ఎనీమియా, తలసేమియా (రక్తహీనత)తో బాధ పడే రోగులకు నెలకు దాదాపు 700 యూనిట్లు రక్తం అవసరమవుతోంది.

● ఏటా దాదాపు 15 వేల ప్రసవాలు జరుగుతుండగా, వీరిలో 5 వేల మంది వరకు రక్తం అవసరం.

(మిగతా 8వ పేజీలో...)



జిల్లా కేంద్ర ఆసుపత్రిలో నిల్వ ఉన్న బ్లడ్ యూనిట్లు

మళ్లీ పొడిగింపు

● సహకార సంఘాలకు ఇప్పట్లో ఎన్నికలు లేనట్లే..
● పర్సన్ ఇన్‌చార్జిల పాలన మరో ఆరు నెలలు
● ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

పాలకొండ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు(పీఏసీఎస్) పర్సన్ ఇన్‌చార్జిల పాలనను మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికలను నిర్వహించి ప్రాజెక్టు కమిటీల ఛైర్మన్లను నియమించింది. ఈ కోవలోనే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందని ప్రచారం సాగింది. అయితే వాటికి ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెడుతూ.. పర్సన్ ఇన్‌చార్జిల పాలన కొనసాగింపునకే మొగ్గు చూపింది. గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలను కూటమి సర్కారు రద్దు చేస్తూ డీసీసీబీలో ఉద్యోగులుగా ఉన్న వారిని పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించింది. అయితే ఇటీవల పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం పూర్తయినప్పటికీ మరో ఆరు నెలల పాటు పొడిగించింది. జిల్లా వ్యాప్తంగా 43 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ఉన్నాయి. వీటికి గాను 16 మంది పర్సన్ ఇన్‌చార్జిలను నియమించారు. ఒక్కో పర్సన్ ఇన్‌చార్జికి నాలుగు నుంచి ఆరు వరకు సహకార సంఘాల బాధ్యతలను అప్పగించారు. కాగా సహకార సంఘాల పాలన సక్రమంగా సాగాలంటే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను నియమించాలని జిల్లా రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పట్లో సహకార ఎన్నికలకు ఎన్నికలు లేకపోవడంతో కూటమి నాయకులు నిరుత్సాహం నెలకొంది.

గాడి తప్పిన సంఘాలు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు నిర్వీర్యమయ్యాయి. రైతులకు సేవలందించాల్సింది పోయి వ్యాపార ధోరణిలోకి మారిపోయాయి. పీఏసీఎస్‌ల్లో 50 శాతం వాటాలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ జగన్ సర్కారు నిర్ణయం తీసుకుంది. దీనిపై రైతులతో పాటు పీఏసీఎస్ ఉద్యోగులు, సిబ్బంది నుంచి నిరసన వ్యక్తం కావడంతో వెనక్కితగ్గారు. గతంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు రైతు సేవలో తరించేవి. తొలుత ఎటువంటి రుసుం చెల్లించకుండానే.రైతులు ఈ సంఘాల ద్వారా పంట రుణాలు, ఎరువులు పొందేవారు. పంట ఉత్పత్తులు విక్రయించిన తరువాత చెల్లించేవారు. అక్కడకు కొద్దిరోజుల తరువాత సభ్యత్వ రుసుం కింద రూ.10 వసూలు చేసేవారు. సంఘ సభ్యులుగా చేర్చుకునేవారు. ప్రాంతీయ వ్యవసాయ కో ఆపరేటివ్ బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీ పేరుతో ఐదేళ్ల పాటు కాలయాపన చేసింది. మరోవైపు రైతులను సొసైటీలకు దూరం చేసింది. సకాలంలో పంట రుణాలు కూడా అందించకపోవడంతో రైతులు అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వచ్చింది. దీంతో పీఏసీఎస్‌ల్లో అన్నదాతల సభ్యత్వం తగ్గిపోయింది. సభ్యత్వ రుసుం ఏకంగా రూ.300కు పెరిగింది.

పొడిగింపు వాస్తవమే..

జిల్లాలో సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిల పాలనను మరో ఆరు నెలలు పొడిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం వాస్తవమే. వచ్చే ఏడాది జూన్ వరకు గడువు పెంచింది.

- శ్రీరామమూర్తి, జిల్లా సహకార సంఘ అధికారి



పాలకొండ పీఏసీఎస్ కార్యాలయం



వీడని వాన.. అన్నదాతల్లో ఆందోళన

8లో

● అల్ప పీడనం కారణంగా కొనసాగుతున్న చిరుజల్లులు
● నీటిలోనే పంట ● పొలాల్లోనే వరి కుప్పలు
● మొక్కజొన్న, పత్తి, అపరాలు, కూరగాయలకూ తీవ్ర నష్టం
● రంగు మారుతున్న ధాన్యం

గజరాజుల బీభత్సం

● గరుగుబిల్లి, భామిని మండలాల్లో హల్‌చల్
● పంటలు ధ్వంసం ● లబోదిబోమంటున్న రైతులు



8లో

క్రిస్మస్ సందడి

● చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

క్రిస్మస్ వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఏసుక్రీస్తు గొప్పతనాన్ని వివరించి, ఆయన బోధనలను వినిపించారు. చర్చిలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చర్చిలు, ఇళ్ల వద్ద క్రైస్తవులు కేక్‌లు కట్ చేసి.. వేడుకలు నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


విజయనగరం: స్విమ్స్ బాప్టిస్టు చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు


వీరఘట్టం: బాప్టిస్టు చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ


రాజాం: ఆర్‌సీఎం చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్


విజయనగరంలోని చర్చిలో..


భామిని: బత్తిలిలో బాలయేసు


మక్కువ: ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు


బొబ్బిలి: సెయింట్ ఆండ్రూస్ లూథరన్ చర్చిలో..


రేగిడి: సంకిలి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


బొబ్బిలి రూరల్: రాముదువలస చర్చిలో ప్రార్థనలు


వేపాడలోని చర్చిలో..


జామి: వెన్నె గ్రామంలో..


కురుపాంలో...


ఎస్.కోట: ఆర్‌సీఎం చర్చిలో..

న్యూస్ బాక్స్

వాల్తేరు డివిజన్‌లో కొన్ని రైళ్లు రద్దు

కొత్తవలస, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే డివిజన్‌లో నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖపట్టణం నుంచి విజయనగరం వరకు నడిచే రైలును (నెంబరు07468-69) గురువారం నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు రద్దు చేయనున్నట్టు తెలిపారు. విజయనగరం నుంచి విశాఖ వెళ్లే రైలును ఈ నెల 27 నుంచి మార్చి 1 వతేదీ వరకు రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. విశాఖ- పలాస (నెంబరు07470-71) రైలును ఈనెల 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

29న విశాఖ- బెనారస్ రైలు..

సౌత్‌ఈస్టన్ రైల్వేపరిధి రూర్కెలా-జార్సుగూడా రైల్వే అభివృద్ధి పనుల కారణంగా విశాఖపట్టణం-బెనారస్ (18311) ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 29 న రద్దు చేస్తున్నట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. బెనారస్-విశాఖపట్టణం (18312) ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 30 న రద్దు చేసినట్టు ప్రకటించారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానం

గజపతినగరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో జరిగిన 50వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీల్లో విజయనగరం జిల్లా బాలుర జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు కోచ్ ఆల్తి తాతబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలను కబడ్డీ క్లబ్ చైర్మన్ రావి శ్రీధర్, జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్ ఐవీపీ రాజు, రంగారావు దోన తదితరులు అభినందించారు.

విద్యుత్ చార్జీల భారం

గుర్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోనే కరెంటు ఛార్జీలు రూపంలో ఏకంగా రూ.15,485 కోట్ల భారాన్ని మోపారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, రాష్ట్ర నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ బెల్లాన బంగారు నాయుడు అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో కరెంటు చార్జీల బాదుడుపై వైసీపీ పోరుబాట కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న పోరుబాట నిర్వహించనున్నట్టు తెలిపారు.

నిబంధనలు సడలించాలి

చీపురుపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం కారణంగా కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయాయని వైసీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం చొరవ చూపించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి

రేగిడి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంకిలి సొసైటీ పరిధిలో ఉన్న 13గ్రామాల రైతులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని సీఈఓ రాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈకేవైసీ లేకపోతే ప్రభుత్వ రాయితీలు, రైతుభరోసా తదితర పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు ఇబ్బంది కలుగుతుందని ఆయన తెలిపారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పతకాలు



కాంస్య పతకంతో నిఖిల్


పతకాలతో విజేతలు

సాలూరు రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జమ్ము-కశ్మీర్‌లోని జమ్ములో జరిగిన జాతీయ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి విజయనగరం విద్యార్థులు కీలక పాత్ర పోషించి ఏపీకి రజత, కాంస్య పతకాలు సాధించినట్టు మేనేజర్ చొక్కాపు సత్యనారాయణ బుధవారం తెలిపారు. జమ్ములో మంగళవారం తుది పోటీలు జరిగాయన్నారు. బాలికల విభాగం రన్నరప్‌గా నిలిచి రజత పతకం సాధించిందన్నారు. ఈ జట్టులో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన పారాది జెడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు కలిశెట్టి మన్విత, అల్లాడి తేజస్విని, పెంట్రెడ్డి చైతన్య కుమారి, తూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు జి.దుర్గాయమున, యు.లోకేశ్వరి కీలకపాత్ర పోషించారన్నారు. బాలుర విభాగంలో ఏపీ జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించిందన్నారు. ఈ జట్టులో బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకులానికి చెందిన నిఖిల్‌సాయి మనోహర్, తూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.స్వాతిక్, పారాది జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తాడి మోహన్‌సాయి, గేదెల నానిబాబు కీలక పాత్ర పోషించారన్నారు. బొడ్డవలస గురుకులం విద్యార్థి నిఖిల్ సాయి మనోహర్‌ను ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, పీడీ విద్యాసాగర్, జిల్లా కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్ తదితరులు అభినందించారు.

జమ్ములో ప్రబలిన అతిసారం


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి తదితరులు

గుర్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్ము గ్రామంలో అతిసార వ్యాధి ప్రబలింది. ఈ గ్రామంలోని సత్యం, రాములమ్మ, నారాయణ, ఆదినారాయణలకు వాంతులు, విరేచనాలు కావడంతో అధికారులు వెంటనే స్పందించారు. తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఈవోపీఆర్డీ వరప్రసాద్ గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంచినీటి కుళాయిలు, వీధి కాలువలు పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. వేడినీరు తాగాలని సూచించారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేకుండా మందులు పంపిణీ చేస్తున్నారు. గ్రామంలో చేపలు, మాంసం వంటివి అమ్మడం, తినడం చేయరాదని చాటింపు వేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే విడుదల చేయాలి


కార్యవర్గ సభ్యులతో డి.వి.రమణ తదితరులు

కొత్తవలస, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రావలసిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏపీఎన్జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వి.రమణ డిమాండ్ చేశారు. బుధవారం కొత్తవలస తాలూకా యూనిట్‌కు సంబంధించి జరిగిన అధ్యక్ష ఎన్నిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1207 జీఓ ద్వారా కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం అన్యాయమన్నారు. త వెంటనే వారిని విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు ఉద్యోగులకు ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. అనంతరం ఎన్నిక నిర్వహించారు. కొత్తవలస తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా ఎన్నికైన జేవీ ప్రసాదరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు, సభ్యులు రమణమ్మ, సూరిదేముడు, రమణ, కళావతి, స్వర్ణ, భాగ్యలక్ష్మి, సత్యారావు, సూర్యారావు, కృష్ణంనాయుడు, శంకరరావు పాల్గొన్నారు.

ఆనందగజపతి కళాక్షేత్రం రుసుం తగ్గింపు

● సేవా, సాంస్కృతిక సంస్థలకు

50 శాతం రాయితీ

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆనంద గజపతి కళాక్షేత్రంలో కార్యక్రమాలు నిర్వహించేందుకు కొన్ని సంస్థలకు రాయితీలు అందించనున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆనంద గజపతి కళాక్షేత్రం ప్రస్తుతం నగర పాలక సంస్థ ఆధీనంలో ఉందన్నారు. క్రీడా, సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను ప్రోత్సాహించాలన్న ఉద్దేశంతో సంబంధిత సంస్థలకు 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఈ ఆడిటోరియం వినియోగానికి రోజుకు రూ.30 వేల వంతున వసూలు చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. క్రీడా, సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకు రోజుకు రూ.15వేలు మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత సంస్థలు గమనించాలన్నారు.

సీఎం సహాయ నిధి పంపిణీ

గరివిడి/చీపురుపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న 5 కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు బుధవారం పంపిణీ చేశారు. శివరాం, పీజేపాలెం, కందిపేట, రేగటి, తాటిగూడ గ్రామాలకు చెందిన 5 కుటుంబాలకు సుమారు రూ.6 లక్షల చెక్కులను రామ్‌మల్లిక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు పైలా బలరాం, సారిపాక సురేష్ కుమార్, సింది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

రాజాం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణానికి చెందిన ఇప్పిలి త్రిలోక్ అనే ఆరు నెలల బాలుడు గత కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ బాలుడి చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.2.50లక్షలు మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో బాలుడి తండ్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు నంది సూర్యప్రకాశరావు, మరిపి జగన్మోహన్‌రావు, టంకాల నాగరాజు, వంగా వెంకటరావు, గురవాన నారాయణరావు, మాడుగుల జయరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చొరవతోనే పదోన్నతులు

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల అధ్యాపకులకు ఇచ్చిన హామీ మేరకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు కల్పించడం పట్ల ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.హనుమంతరావు, ఎస్.శ్రీనివాసరావులు హర్షం వ్యక్తం చేశారు. పూర్తి పారదర్శకంగా పదోన్నతులు కల్పించిందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లకు ధన్యవాదాలు తెలిపారు. తమకు సహకరించిన శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్, ప్రిన్సిపాల్ సెక్రటరీ కోన శశిధర్, ఇంటర్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా, ఏపీజీఈఎ అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణలకు ధన్యవాదాలు తెలిపారు.

రేపు ఓపెన్ ఫోరం

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 27న శుక్రవారం ఓపెన్ ఫోరం కార్యక్రమంతో పాటు ఎల్ఆర్ఎస్ బిల్డింగ్ షాట్‌ఫాల్ దరఖాస్తులు ఆమోదానికి ప్రత్యేక మేళాను నిర్వహిస్తున్నటు కమిషనర్ పి.నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో అక్కడిక్కడే ప్రజల సమస్యలు పరిష్కరించి ప్రణాళికా విభాగం తరుపున అవసరమైన అన్ని అనుమతులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఈ మేళాను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బాలికకు ఆర్థిక సాయం

కొత్తవలస, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న బాలిక వైద్యం నిమిత్తం కొత్తవలసకు చెందిన అయ్యరక సామాజిక వర్గ యువజన ప్రాంతీయ విభాగం బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేసింది. కొత్తవలస గ్రామానికి చెందిన కర్రి జాన్వి అనే 9 సంవత్సరాల బాలిక బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న సామాజిక వర్గ సభ్యులు బాలిక తల్లి తండ్రి ఎర్రాపాత్రుడు, దేవిలకు ఈసాయాన్ని అందజేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...


పార్టీలో చేరిన వారితో పతివాడ, రవిశేఖర్ తదితరులు

నెల్లిమర్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయితీ వైసీపీ నాయకులు , మాజీ సర్పంచ్ బయిరెడ్డి నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బయిరెడ్డి లీలావతి దంపతులతో పాటు నాయకులు మహంతి రాంబాబు, కొక్కిరి మల్లేష్ మరో 50 కుటుంబాల వారు ఆ పార్టీని వీడారు. వీరంతా బుధవారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక బయిరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి నారాయణ స్వామి నాయుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ తదితరులు వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ అట్టాడ శ్రీధర్, నాగవంశం కన్వీనర్ అవనాపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలుని సన్నిధిలో సంకీర్తన ఉత్సవం


సంకీర్తన ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

జామి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నంరాజుపేట శ్రీపుష్పగిరిలో వేంచేసి ఉన్న శ్రీవేణుగోపాలస్వామి సన్నిధిలో ధనుర్మాస పూజలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహారం సీతారామచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి సంకీర్తన ఉత్సవం నిర్వహించారు.

డెంకాడ ఎస్ఐకి ప్రశంసా పత్రం



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ

డెంకాడ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఐ ఆరంగి సన్యాసి నాయుడుకు విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం రెండు ప్రశంసాపత్రాలు అందజేశారు. లోక్ అదాలత్ కేసుల్లో మంచి పురోగతిని సాధించినందుకు, పోలీస్ స్టేషన్‌లో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించినందుకు గాను ఈ ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐని స్థానిక సిబ్బంది అభినందించారు.

వీడని వాన.. అన్నదాతల్లో ఆందోళన

- అల్ప పీడనం కారణంగా కొనసాగుతున్న చిరుజల్లులు
- నీటిలోనే పంట
- పొలాల్లోనే వరి కుప్పలు
- మొక్కజొన్న, పత్తి, అపరాలు, కూరగాయలకూ తీవ్ర నష్టం
- రంగు మారుతున్న ధాన్యం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. చాలావరకు రైతులు వరి నూర్పులు పూర్తి చేసుకోగా, కొందరు ఇంకా పూర్తి చేసుకోలేకపోయారు. వర్షాలు ఎప్పుడు తగ్గుతాయని ఆందోళన చెందుతున్నారు. చేతికి వస్తుందనుకున్న పంట.. పొలాల్లోనే తడిచి ముద్దయిపోతోంది. పలు చోట్ల నూర్పులు పూర్తయిన ధాన్యం మిల్లులకు చేరక రైతులు అల్లాడుతున్నారు. పొలాల్లోనే వరి పంటను కుప్పలుగా వేసి ఉంచారు. వర్షపు నీరు వాటిపైనే పడడంతో ధాన్యం రంగుమారి కొన్ని చోట్ల మొలకలు కూడా వస్తున్నాయి. అలాగే అపరాలు, కూరగాయలు, మొక్కజొన్న, టమాటా తదితర పంటలు నీటిలో ఉండడంతో కుళ్లిపోయి అపార నష్టం వాటిల్లితోంది.



రామభద్రపురం: నీట మునిగిన క్యాబేజీ పంట



బొండపల్లి: బోడసింగిపేట వద్ద గట్లుపై తడిచిపోతున్న వరి ఓవులు



సాలూరు రూరల్: దుగ్గసాగరంలో టమాటా పంట ఇలా..

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి ఇలా..

పార్వతీపురం, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలోని సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం నిల్వలు 105 మీటర్లు ఉండాల్సి ఉండగా 49 మీటర్లు నీటి నిల్వలు ఉన్నాయి. వీఆర్ఎస్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 161 మీటర్లు ఉండాల్సి ఉండగా తాజా 16.0.4 మీటర్లు నీటినిల్వలు ఉన్నాయి. ఒట్టిగెడ్డ రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్ 121.62 మీటర్లు ఉండాల్సి ఉండగా 111.31మీటర్లు నీటినిల్వలు ఉన్నాయి. పెద్దగెడ్డ రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్ 213.80 కాగా 211.54 మీటర్లు నీటిమట్టం నమోదయ్యింది. కురుస్తున్న వర్షాల వల్ల నీటిమట్టాల నిల్వ మరింత పెరిగే అవకాశం ఉంది.



పాలకొండ: మొలకెత్తిన ధాన్య ఓవులను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు



వీరఘట్టం: పరదాలు కప్పిన వరి పంట కుప్పలు



గుర్ల: పాలవలసలో నీట మునిగిన వరిపనలు

అన్ని విధాలా ఆదుకుంటాం



ఒమ్మి గ్రామంలో పెసర, మినప పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నష్టపోయిన రైతులను టీడీపీ అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ హామీ ఇచ్చారు. ఒమ్మి గ్రామంలో పెసర, మినప పంటలను ఆయన బుధవారం పరిశీలించి, రైతులకు ధైర్యం చెప్పారు. నీట మునిగిన పంటను పరిశీలించి, నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.



పార్వతీపురం: తోటపల్లి ప్రాజెక్టు

వెంగళరాయసాగర్‌కు వరద ఉధృతి

మక్కువ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శంబర గ్రామ సమీపంలో ఉన్న వెంగళరాయ సాగర్ జలాశయానికి వరదనీరు వచ్చి చేరడంతో బుధవారం అధికారులు సువర్ణముఖి నదిలోకి 200 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. జలాశయంలోకి ఫ్లో ఎక్కువైతే మరికొన్ని క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచి పెట్టనున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజశేఖరరెడ్డి తెలిపారు.



వెంగళరాయసాగర్ నుంచి నీటిని విడిచిపెడుతున్న దృశ్యం

మండలాల వారీగా వర్షపాతం ఇలా..

పార్వతీపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మండలాల వారీగా నమోదైన వర్షపాతం ఇలా ఉంది. పాలకొండలో ఐదు మిల్లీ మీటర్లు, వీరఘట్టంలో 9.06 మిల్లీ మీటర్లు, జీఎంవలస 13.4 మిల్లీమీటర్లు, కురుపాంలో 20.6 మిల్లీమీటర్లు, గుమ్మలక్ష్మీపురంలో 21.2 మిల్లీమీటర్లు, సీతంపేటలో 8.4 మిల్లీమీటర్లు, భామినిలో 9.6 మిల్లీమీటర్ల వర్షం కురిగింది. అలాగే పార్వతీపురంలో 22.4, కొమరాడలో 11.6, బలిజిపేటలో 18.8, గరుగుబిల్లిలో 15.6, సీతానగరంలో ఆరు, సాలూరులో 5.8, మక్కువలో 12.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. ఈనెల 24 తేదీతో పాటు 25వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు జిల్లాలో 526.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది.



గజపతినగరం: మదుపాడలో మొలకెత్తిన వరి పనలు

అర్ధాంతరంగా కరకట్టలు..

- ఆందోళనలో తీర ప్రాంత వాసులు

రేగిడి, డిసెంబరు 25, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగావళి నదీ తీర గ్రామాల్లో వరద భయం వెంటాడుతోంది. ఆయా గ్రామాల నదీ తీరంలో నిర్మిస్తున్న కరకట్టలు అర్ధంతరంగా నిలిచిపోవడమే దీనికి కారణం.

133 హెక్టార్లలో నేలకొరిగిన మొక్కజొన్న

బొబ్బిలి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల్లో 138 మంది రైతులకు సంబంధించిన 133 హెక్టార్ల మొక్కజొన్న పూర్తిగా నేలకొరిగిందని, పంట నీట మునిగిందని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు వ్యవసాయశాఖ ఏడీ మజ్జి శ్యామ్ సుందర్ బుధవారం తెలిపారు. ఒక్క రామభద్రపురం మండలంలోనే 132 హెక్టార్ల పంట నష్టం జరిగిందని చెప్పారు. డివిజన్ పరిధిలో వరిపంట కేవలం రెండు హెక్టార్లలో మాత్రమే నష్టం సంభవించినట్టు గుర్తించామని ఏడీ తెలిపారు. పంటలు ఏమైనా 33 శాతానికి పైగా నష్టపోతేనే పరిహారం అందే అవకాశం ఉందన్నారు.



శివడవలసలో నేలకు ఒరిగిన మొక్కజొన్న పంట



బొబ్బిలి రూరల్: దిబ్బగుడ్డివలసలో వరి పొలాల్లో చేరిన వర్షపు నీటిని బయటకు పంపుతున్న దృశ్యం

అత్యవసరమైతే.. అంతే!

(ఐదో పేజీ తరువాయి)

● అంతేకాకుండా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాలు, గాయాలతో వెళ్తున్న వారిలో చాలామందికి రక్తం కావాలి. వీరందరికీ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని రక్తనిధి, సరఫరా కేంద్రాల నుంచి రక్తం అందించాల్సి ఉంది.

● ప్రైవేట్ ఆసుపత్రుల్లో వారికి అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాలంటే బొబ్బిలి ప్రైవేట్ రక్తనిధి కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. వారు కొంత డబ్బులు తీసుకోవడంతో పాటు డోనర్ నుంచి బ్లడ్ తీసుకొని అవసరమైన రక్తం ఇస్తున్నారు.

నిల్వలు ఇలా..

పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో రక్తనిధి కేంద్రం ఉండగా.. పాలకొండ, సాలూరు, కురుపాంలో బ్లడ్ స్టోరేజీ యూనిట్లు ఉన్నాయి. అయితే సీతంపేట, భద్రగిరి, చినమేరంగి సీహెచ్‌సీలకు స్టోరేజీ యూనిట్లు మంజూరైనా.. టెక్నీషియన్లు లేని కారణంగా ఆయా చోట్ల అవి ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఆ సీహెచ్‌సీలకు జిల్లా కేంద్రాసుపత్రి నుంచే రక్త నిల్వలను తీసుకురావల్సి వస్తోంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు అత్యవసర సమయాల్లో జిల్లా కేంద్రాసుపత్రికి పరుగులు తీయాల్సి వస్తోంది.

దాతలు ముందుకు రావాలి

జిల్లా వ్యాప్తంగా రోజుకు 50 యూనిట్ల వరకు రక్తం అవసరం అవుతోంది. రక్తదాన శిబిరాలు విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో రక్తదాతలు ముందుకు రావడం లేదు. దీంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. అత్యవసర వేళల్లో వారి కుటుంబ సభ్యులు, రోగుల నుంచి రక్తం సేకరించాల్సి వస్తోంది. జిల్లాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో రక్తదాతలు ముందుకు రావల్సి ఉంది.

- వాగ్దేవి, డీసీహెచ్ఎస్, పార్వతీపురం మన్యం

పాలకొండలో ఏర్పాటుకు అనుమతి

పాలకొండ ఏరియా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటుకు అనుమతి, లైసెన్స్ వచ్చింది. త్వరలో బ్లడ్ బ్యాంక్ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇంతకుముందు రోగులు బ్లడ్ కోసం పార్వతీపురం లేదా శ్రీకాకుళం పరుగులు పెట్టేవారు. ఇకపై ఆ ఇబ్బందులు ఉండవు.

- జి.నాగభూషణరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, పాలకొండ

నిల్వలు ఇలా..

కేంద్రాలు	బ్లడ్ స్టోరేజీ సామర్థ్యం (యూనిట్లలో)	ప్రస్తుతం
జిల్లా కేంద్రాసుపత్రి	300	150
పాలకొండ	50	15
సాలూరు	50	11
కురుపాం	50	07
చినమేరంగి	50	ప్రారంభం కాలేదు
సీతంపేట	50	ప్రారంభం కాలేదు
భద్రగిరి	50	ప్రారంభం కాలేదు

గజరాజుల బీభత్సం

- పంటలను ధ్వంసం చేసిన వైనం
- భీతిల్లుతున్న ప్రజలు

గరుగుబిల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకి గ్రామంలో వరి చేల కుప్పలను ఏనుగుల గుంపు ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజుల నుంచి సంతోషపురం, సుంకి, మరుపెంట గ్రామాల్లో సంచరిస్తున్నాయి. మంగళవారం రాత్రి సుంకి గ్రామ సమీపంలోని చెరువులో ఉంటూ రాత్రి సమయంలో పంటలను ధ్వంసం చేశాయి. గ్రామంలోని గొల్లు అన్నపూర్ణ, గొల్లు చంద్రమౌళి, గులిపిల్లి కమల, తదితర రైతులకు చెందిన పంట పొలంలో వేసిన వరి కుప్పలను తిని చెల్లా చెదురు చేసి తీవ్రంగా నష్టపరిచాయి. అలాగే పంట పొలంలోని పైపులైన్లను ధ్వంసం చేసి నష్టపరిచాయి. ● భామిని, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భామిని ప్రాంతంలో ఏనుగులు అలజడి సృష్టించాయి. మంగళవారం రాత్రి పోతల చంద్రబోస్‌కు చెందిన ధాన్యం కుప్పను ధ్వంసం చేశాయి. తుఫాన్ కారణంగా పొలంలోనే ఉంచిన వరికుప్పను గత శుక్రవారం ఏనుగులు చిందర వందర చేశాయి. మళ్లీ ఆ ప్రాంతంలో సంచరించి వరి చేను కుప్పను ధ్వంసం చేశాయి. తిండి గింజలు బురద పాలయ్యాయని రైతులు లబోదిబోమంటున్నారు.



గరుగుబిల్లి: సుంకిలో ఏనుగులు నష్టపరిచిన వరి కుప్పలను చూపిస్తున్న రైతు



భామినిలో వరికుప్పను చిందరవందర చేసిన ఏనుగులు

నష్ట పరిహారం ఇవ్వాలి

జియ్యమ్మవలస, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాడైన ఇళ్లకు నష్ట పరిహారం అందివ్వాలని సీపీఎం మండల సభ్యుడు గరుగుబిల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన తుంబలి గ్రామాన్ని సందర్శించారు. వర్షాలకు నష్టపోయిన ఇళ్లను పరిశీలించారు. దళితులు, గిరిజనులకు చెందిన పలు ఇళ్ల శ్లాబులు పెచ్చులు ఊడిపోయి కారిపోతున్నాయన్నారు. పలువురి ఇళ్లు పాడైపోయాయని చెప్పారు. బాధితులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

చీటింగ్ కేసు నమోదు

వీరఘట్టం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు వ్యాపా రి దుద్దుపూడి సూరిబాబుపై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.కళానిధి బుధవారం తెలిపారు. మండలంలోని ఎం.రాజపురం గ్రామానికి చెందిన తుమరాపు అప్పలనాయుడు అక్టోబరు నెలలో రెండు లారీ లోడ్ల జొన్న పిక్కలను కొవ్వూరు వ్యాపారి దుద్దుపూడి సూరిబాబుకు విక్రయించారు. అయితే రూ.2లక్షలు మాత్రమే ఇచ్చి మిగిలిన రూ.6లక్షలు ఇవ్వకపోవ డంతో అప్పలనాయుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

సీతానగరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిడగళ్లు, జోగింపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న అనధికార బెల్ట్ షాపులపై దాడులు చేసి, రెండు కేసులు నమోదు చేసిన ట్లు ఎక్సైజ్ సీఐ పద్మావతి బుధవారం తెలిపారు. 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మద్యం అక్రమ అమ్మకాలపై 9440902373కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

ఏపీజీవీబీ సేవలకు తాత్కాలిక అంతరాయం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ) సేవలు ఏపీ రాష్ట్రానికి మాత్రమే పరిమితం అవుతాయని, తెలంగాణ రాష్ట్రంలోని శాఖలు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం కానున్నాయని బొబ్బిలి ఏపీజీవీబీ మేనేజర్ మజ్జి సత్యనారాయణ తెలిపారు. ఈసందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ డిసెంబరు 28 నుంచి డిసెంబరు 31 వరకు బ్యాంకింగ్ సేవలు తాత్కాలికంగా నిలిపివేస్తారని చెప్పారు. ఖాతాదారులు అత్యవసర లావాదేవీలను 27వ తేదీ లోపు పూర్తి చేయగలరని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

సాలూరు రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం పదో పాశురం సందర్భంగా సాలూరులోని కల్యాణ వేంకటేశ్వర స్వామి, పెదకోమటి పేట రామాలయాల్లో బుధవారం వైభవంగా పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు. ● మార్గశిర బహుళ ఏకాదశి సందర్భంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో శ్రీవారికి నిత్య కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.



శ్రీవారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బీజేపీ మున్సిపాల్టీ అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు

పాలకొండ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలకొండ మున్సిపాల్టీ అధ్యక్షుడిగా ఎం.ఉమా మహేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలకొండలో బుధవారం నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పావని, రిటర్నింగ్ అధికారిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, మున్సిపాలిటీ రిటర్నింగ్ అధికారి చొక్కా మహాలక్ష్మీ, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ టంకాల దుర్గారావు.. ఉమా మహేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకుని, నియామక పత్రాన్ని అందించారు. ఆయన్ని పలువురు అభినందించారు.

ఫైబర్ నెట్ కేసులో దోషులను శిక్షించాలి

బొబ్బిలి/రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఫైబర్‌నెట్ సంస్థలో అక్రమాలకు పాల్పడిన దోషులందరినీ కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సంచాన గంగాధర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బొబ్బిలిలోని తన కార్యాలయంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థల న్నిటినీ అవినీతి అక్రమాలతో ఎంతలా భ్రష్టు పట్టించారో అర్థమవుతోందన్నారు. ఈ సంస్థ నష్టానికి కూరుకుపోవడానికి కారకులైన, బాధ్యులైన ప్రతి అధికారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాల్టీ పరిధి పల్లె వీధిలో బుధవారం పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్ఐ రమేష్ తెలిపారు. ఐదుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.9,100లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఆర్టీసీ డిపో తనిఖీ

పాలకొండ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఆర్టీసీ డిపోను ఆ సంస్థ డీపీటీవో కొట్నాన శ్రీనివాసరావు బుధవారం తనిఖీ చేశారు. అనంతరం పాలకొండ నుంచి బూర్జ రోడ్డు వరకు ప్రత్యేక బస్సు ద్వారా ప్రయాణించి, తనిఖీలు చేపట్టారు. టెస్ట్ డ్రైవ్‌ను చేయించారు. ఈసందర్భంగా ఆయన.. బస్సులు మెయింటెనెన్స్ నిమిత్తం మెకానిక్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు పాలకొండ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, మెకానిక్ ఏఈ రాము, సిబ్బంది రాజు, బీకే మూర్తి తదితరులు పాల్గొన్నారు.